నలిగిన హృదయాలు

శ్రీమతి పతానేని శ్రీశైలభ్రమరాంబ

గిరిజ కళ్ళంట నీళ్ళు ధారగా కారిపోతున్నాయి. అణగిమణగి వున్న ప్రేమాగ్ని ప్రజ్వరిల్లింది. నిద్రించి వున్న తనలోని ప్రేమ మేల్కొంది. మొట్టమొదటి నుంచీ బావమీద తనకున్న ప్రేమ పొంగి పొరల నారంభించింది. ఆ ప్రేమ ప్రవాహమంతా కళ్ళ నుంచి కన్నీటిధారలై గట్లు త్రెంచుకు ప్రవహిస్తోంది. తన బ్రతుకంతా ఇంక గాఢాంధకారమేనా? బావ మనస్సు మారదా? తనబావ లోకాని కందరికీ డాక్టరై చికిత్స చేస్తున్నా, తన మనోగాయానికి మందు ఇవ్వలేడా? బావలో గొప్పతనం హెచ్చిన కొద్దీ తనను అతడు ఎంతో దూరం చేస్తున్నాడని తన అంతరాత్మే హెచ్చరిస్తోంది. బావ తననీ, తన హృదయాన్ని ముక్కముక్కలుగా చేసి తను కన్నీటితో కుమిలిపోతోంటే; తన కన్నీటి కెరటాల్లోంచి ఈదుకు ముందుకుపోయి ఏమి ఆదర్శాలను సాధించుకోగలడు? తన ప్రేమకు ఫలితం కన్నీరేనా? ఎవరి మనసుల్లో ప్రేమకుసుమాలు వికశిస్తాయో అక్కడే శూన్యత కూడా నివసిస్తుందా? ఎక్కడైతే ప్రేమ వెన్నెలలు వెదజల్లుతూ వుంటుందో అక్కడే అంధకారంకూడా ఆవరించుకొంటూంటుందా? ఎక్కడైతే స్నేహగంగ ప్రవహిస్తుందో అక్కడే స్వార్థత్యాగతరంగాలు లేస్తాయా? అమృతమయమైన తన ప్రేమని హాలాహలంగా భావిస్తున్నాడా తన బావ? మాధుర్యంగా జీవయాత్ర సాగించాలనుకున్నా తమ జీవితాలకు, ఎందుకింత కటుత్వం వచ్చింది? తనబావ ఇంక తనకి దక్కడా? తన అదృష్టమంతా నశించిపోయినట్లేనా?

ప్రకృతికి ప్రతికూలంగా బావ ఎన్నాళ్ళు నడువగలడు? బావకి తనపై సర్వాధికారాలూ ఉన్నాయ్. బావ మస్తిష్కంలో తను గుర్తుకురాకపోయినా తన హృదయంలో మాత్రం బావ స్థిరంగా నివాస మేర్పరచుకున్నాడు. బావకీ తనకీ చిన్ననాడే వివాహబంధం, చిన్ననాడే వివాహమయింది. పసిపిల్లలుగా వున్నప్పుడే బావా తనూ దంపతులయ్యారు. బొమ్మల పెళ్ళిలా తమకు జరిగిన వివాహబంధం జీవితాంతం విడివడని బంధమై గమ్యస్థానాన్ని చేరుకుంటుందని తమవాళ్ళంతా ఆశించారు. సీతా, సావిత్రీ, అనసూయ, చంద్రమతివంటి భారతీయ వనితలవలె సమస్తసౌభాగ్యములను పొందుతూ ఆదర్శగృహిణిగా జీవించాలని తనూ ఆశించింది. ఎన్నో ఆశలతో, అనేక కోరికలతో ఉవ్విళ్ళూరుతూ జీవితాన్ని ముందుకు నెట్టుకు వస్తోంది. కాని తన మనస్సుకి శాంతిలేదు. తనువుకి సుఖంలేదు. హృదయానికి తృప్తిలేదు. ఇంతేనా తన బ్రతుకు? తన హృదయవిదారకమైన ఆక్రందన తన బావ ఇంక తెల్సుకోలేడా? తన జీవితమంతా నిరాశా నిస్పృహలతో అంతం కావల్సిందేనా? తన బావని చూచి అందరూ గౌరవిస్తున్నారని తన మనస్సులో ఎంతో గర్వించేది. బావ మెడిసిన్ ప్యాసైననాడు తన ఆనందం; ఆనాడు తన హృదయం సంతోషతరంగాలతో ఉప్పొంగిపోతూంటే ఆ పరమానందాన్ని బయటపెట్టడానికి తనయిల్లు కూడా చాలక తన మిత్రులందరితోనూ చెప్పుకొని మురిసిపోతూంటే; అదంతా తన అదృష్టమేనని వృద్ధసువాసినులందరూ ఆశీస్సులిచ్చారు. కాని తనకట్టి యోగ్యత ఎంతో దూరమైపోతోంది. తనకి ఆతృత హెచ్చినకొలదీ తన ఆశలన్నీ గగనకుసుమాలుగా అయిపోతున్నాయి. తను యీ పంచవర్షాల్లోనూ కంటికి తడిపెట్టని రోజే లేదనవచ్చు. తన బావ ప్రసాద్‌ని తల్చుకోని క్షణమే లేదు. ఒక్కసారిగా తనకి వర్తమానంలో ఆలోచనలు గతంలోకి మళ్ళాయి. పాతస్మృతులు అన్నీ పదేపదే గుర్తుకు వస్తున్నాయి.

గిరిజ, ప్రసాద్ మేనత్త మేనమామ బిడ్డలు. గిరిజ తండ్రి కొండలరావు. ఎలిమెంటరీ స్కూలు మాష్టరుగా నలుగురు పిల్లలతో వృద్ధమాతతో చాలీచాలని జీతంతో జీవయాత్ర సాగిస్తున్నాడు. ప్రసాద్ తల్లిదండ్రులకి ఒక్కడే ఏకైక పుత్రుడు. ప్రసాద్ తండ్రి లాయర్‌గా బాగా సంపాదిస్తున్నాడు. గిరిజ పంచవర్షాల ప్రాయంలో ఒకటవ క్లాసు చదువుతూ వుండగా మేనత్తగారి కుటుంబం వీరింటికి వచ్చారు.

అప్పటికి ప్రసాద్‌కి పదవ సంవత్సరం సెకండు ఫారం చదువుతున్నాడు. ఆ పసివాళ్ళ అన్యోన్యత చూచి కొండలరావు తల్లి సావిత్రమ్మ ఎంతో సంతోషంతో మురిసిపోయింది.

ప్రసాద్ తండ్రి కామేశ్వర్రావు పదేళ్ళ ప్రాక్టీసులోనే ఇంత ధనవంతుడై పేరుప్రఖ్యాతులు తెచ్చుకుంటే... ఇంక కొడుక్కి పెండ్లి వయస్సు వచ్చేసరికి ఇంకా ఎంత గొప్పవాడౌతాడో?... అంతటి వున్నత స్థితిలోవున్న అతడు తన ఏకైక పుత్రుడు ప్రసాద్‌కి గిరిజను చేసుకుంటాడా? క్రమంగా కొండలరావు స్థితి దిగజారి కుటుంబం వృద్ధవుతోంది. ఇంక ముందు తన కొడుకూ, కూతురుకి అంతస్థుల్లో భేదాలువచ్చి బంధుత్వాలు కూడా విడిపోతాయేమోనని బాధపడింది సావిత్రమ్మ. చివరకు తన ఉద్దేశాన్ని కొడుకు అల్లుడు దగ్గరుండగా బయటపెట్టింది సావిత్రమ్మ.

"ఇంత చిన్నపిల్లకి పెళ్ళిచెయ్యడానికి అప్పుడే తొందరేముంది? పెద్దవాళ్ళయ్యాక వారి అభిప్రాయాలు ఎల్లా మార్తాయో!" అన్నాడు కామేశ్వర్రావు.

"నేను పెద్దదాన్నయ్యా! కొడుకుని కూతుర్ని సమంగా కళ్ళల్లో పెట్టుకు పెంచా. వాళ్ళ అన్నా చెల్లెళ్ళలో అభిమానం వుంచుకుని వియ్యంపొంది శాశ్వతంగా విడిపోకుండావుంటే ఈ ముసలిప్రాణం సంతోషిస్తుంది" అంది సావిత్రమ్మ.

తల్లి మాటకు ఎదురాడని కొండలరావు, అతని భార్య సంతోషంగా అంగీకరించారు. పద్మావతి కూడా తల్లి మాటనే స్థిరపర్చి అన్నతో వియ్యం పొందాలనీ, తన కొడుకు ప్రసాద్‌కి గిరిజ తగిన పిల్ల అనీ చెప్పడంతో కామేశ్వర్రావు కూడా అంగీకరించక తప్పిందికాదు.

వృద్ధమాత సావిత్రమ్మగారి కోరిక ప్రకారం అయిదేళ్ళ గిరిజకి పదేళ్ళ ప్రసాద్‌కి దిగ్విజయంగా వివాహమహోత్సవం జరిగిపోయింది.

◆ ◆ ◆

ప్రసాద్ మర్నాడు మద్రాస్ మెడిసన్ చదువుకి వెడ్తున్నాడని తెలిసి గిరిజ ఎంతో ఆనందించింది. తన బావను చూచి అప్పటికే రెండేళ్ళయింది. ఒక్కసారి ఎల్లాగైనా చూడాలన్న వాంఛను మనస్సులో ఆపుకోలేక తండ్రితో చెప్పి తమ్ముణ్ణి తీసుకుని అత్తవారింటికి వెళ్ళింది.

గుమ్మంలో బండి దిగిన గిరిజను చూచి పలక్కరించినట్లుగా "ఇదేనా గిరిజా రావడం? ఖులాసాయేనా? మీ యింట్లో అంతా సుఖంగా ఉన్నారా?" అన్నాడు ప్రసాద్.

"నువ్వు రేపే వెళ్ళిపోతావని విన్నాక ఇంక నిన్ను చూడకుండా వుండలేక వచ్చేశా. ఇవ్వాళ ఒక్కరోజైనా నీతో గడిపి రేపు వెళ్ళిపోతా" అంది గిరిజ.

"నీ చదువు బాగా సాగుతోందా?" చిరునవ్వుతో అడిగాడు.

"నీ దయవల్ల బాగానేవుంది" అంది ఆనందంగా.

"సరే! లోపలికి రా!" అంటూ ఆహ్వానించాడు ప్రసాద్. గిరిజ మేనత్త దగ్గర కూర్చున్నదన్నమాటేగాని ఆమె మనస్సంతా బావవైపుకే పరుగెడ్తోంది. తమకి చిన్నప్పుడే వివాహమైనా తనని భార్య అని చెప్పడానికి ప్రసాద్ ఒప్పుకోడు. అతనికి బాల్యవివాహాలంటే ఎందుకో యిష్టంలేదు. ఆ వుద్దేశంతోనే తన చదువు పూర్తయి ఉద్యోగంలో చేరేవరకూ తనని "బావా!" అనే పిలవమన్నాడు. అతనికి ఏది యిష్టమో తనకీ అదే సమ్మతము. తన ఎదుటనే తన బావ అతనికింకా పెళ్ళికాలేదని చెబుతూంటే విన్నప్పుడు మాత్రం తన మనస్సు చివుక్కుమనేది. అయినా బావ మాటకి ఎదురాడలేక ఎల్లాచెప్పినా బావ తనవాడే! తన భర్తే!! తన సొత్తే!!! అని తృప్తిపడేది. బావ చదువు పూర్తయి వచ్చేవరకూ తనని కూడా చదువుకోమని చెప్పాడు. అంతేకాదు. తన చదువుకయ్యే ఖర్చుకూడా తండ్రిని పంపించమని, నిక్కచ్చిగా చెప్పాడు బావ.

ఆ రోజంతా గిరిజా, ప్రసాద్ లిద్దరూ తాము చదువుకోబోయేదాన్ని గురించి చెప్పుకున్నారు. బాగా శ్రద్ధగా చదివి ప్యాస్ అవుతుండాలని గిరిజను మరీమరీ హెచ్చరించాడు ప్రసాద్.

ప్రసాద్‌ను యం.బి.బి.యస్. చదువుకోసం మద్రాసు సాగనంపి మెయిల్ వెళ్ళేవరకు చూచి అత్తమామలతోబాటు ఇంటికి వచ్చింది గిరిజ. మళ్ళీ తన చదువుకోసం ఆరోజే వచ్చేసింది గిరిజ.

◆ ◆ ◆

ఎం. బి. బి. యస్. మొదటి తరగతిలో ప్యాసయ్యాడు ప్రసాద్. తన ఆదర్శాలకు, ఆశయాలకు తగినట్లుగా కార్యరంగంలోకి దూకి తన జీవితాన్ని సార్థకం చేసుకోవాలనుకున్నాడు. దేశాభ్యుదయం, ప్రజాశ్రేయస్సుకు డాక్టర్లు నిర్వహించవలసిన

బాధ్యత ఎంతైనావుందని కాలేజీ జీవితంలో ఎంతో ఘాటుగా ఉపన్యాసాలిచ్చేవాడు. మానవకోటి కందరికీ ప్రధాన సమస్యలైన జీవన్మరణాలు. రోగాలకు సంబంధించిన వృత్తి నవలంబించే ప్రతీ డాక్టరు తన బాధ్యతలను గుర్తించి, అత్యంత ఆసక్తితో శ్రద్ధ వహించి ప్రజలను చూస్తుండాలనీ, పదవులూ, అధికారం, ధనం, హోదాకోసం ప్రాకులాడకుండా నిస్వార్థమైన మానవసేవతే తమ ధర్మంగా భావించి అహోరాత్రాదులు కృషి చెయ్యాలనీ ఉద్బోధించేవాడు. అందులో సామాన్యజనులు, నిరుపేదలయందు ప్రత్యేకమైన ఆసక్తి, జాలి, దయ వెల్లడించేవాడు.

అతనిలోని ఉత్సాహానికీ, ఆశయాలకీ ప్రొఫెసర్లు, తోటి సహాధ్యాయులు ఎంతో మెచ్చుకునేవారు. కాలేజీ వదలి ఇంటికి వచ్చేటప్పుడు కూడా "ప్రసాద్! ఇదివరకంతా ఉపన్యాసాలు కాబట్టి ఎన్నైనా యిచ్చేవాడివి. అవన్నీ ఈ మద్రాసులోనే వదిలేస్తావో! ఆచరణలో పెడ్తావో! నిజంగా నువ్వు ఆచరించాలన్నా గాని మీ అమ్మా, నాన్నా నీ ముక్కుకు తాడోసి మూడుముళ్లూ వేయించి భార్యను అంటకడ్తారు. అంతటితో నీ ఆదర్శాలు, ఆశయాలు బంద్!" అంతేనా?" అన్నారు మిత్రులు.

"ఈ ప్రసాద్ అన్నమాట తిరగడని మీకు త్వరలోనే తెలుస్తుందిగా! నా జీవితమంతా మానవసేవకోసమే వినియోగించి సార్థకపరుస్తోదల్చుకున్నా" అని ఖండితంగా చెప్పాడు ప్రసాద్.

తను భవిష్యత్‌లో చెయ్యబోయే మానవసేవను గురించి తన ఆదర్శాలు, ఆశయాలు ఎల్లా నెరవేర్చుకోవాలో, దేశాభ్యుదయం కోసం తన సర్వస్వం అంకితంచేసి రోగులకోసమే తన సర్వం త్యాగం చెయ్యాలని మనస్సులో నిశ్చయాభిప్రాయాన్ని దృఢపర్చుకొని పట్నంనుంచి ఇంట్లో అడుగుపెట్టాడు ప్రసాద్.

ప్రసాద్ గుమ్మంలోకి రాగానే తండ్రి, "నాయనా! నీ చదువు పూర్తయింది. నీ యిష్టప్రకారం గిరిజ కూడా బి.ఏ. పూర్తిచేసింది. ఇంక మీరిద్దరూ అన్యోన్యంగా కాపురం చేస్తోంటే మాచి ఆనందించడమే మాకు కావల్సింది. నీ మాటే తీసుకుని శుభముహూర్తం పెట్టించాలనుకొంటున్నాం" అన్నాడు.

ఈ మాటలు విన్న ప్రసాద్ మిన్ను విరిగి మీద పడ్డట్టయింది. నిజానికి తనకి గిరిజ అంటే ఎంతో ఇష్టమే. ఆమె తనకి అర్ధాంగి. అగ్నిసాక్షిగా చిన్నినాడే స్వీకరించిన భార్యను తను ఆదరించవలసినవాడే. కాని... కాని... తనకి మద్రాసు చదువుతో మనస్సు మారింది. భార్యను ఇంటికి తెచ్చుకుంటే తనకి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు నశిస్తాయేమోనని భయం పట్టుకుంది. తన ఆదర్శాలు నెరవేర్చుకుందుకు తాను ఒంటరిగానే యుండాలని మనస్సాక్షిగా తీర్మానించుకున్నాడు. అందుచేతనే మొండిధైర్యం తెచ్చుకుని, "నాన్నా! ఇంత చదువూ చదివినందుకు అందరిలా భార్యకు విధేయుడనై నా స్వేచ్ఛను చంపుకు జీవించలేను. గిరిజను ఇంటికి తెచ్చుకుంటే ఇంక పిల్లలుతోసహా సంసారంలో కూరుకుపోతే! ఆ తాపత్రయంలో పడినట్లయితే నా ఆశయాలు నెరవేర్చుకోలేను" అన్నాడు ప్రసాద్.

ఇల్లాంటి మాటలు ప్రసాద్ నోటంట వస్తాయని ఎన్నడూ ఊహించని కామేశ్వర్రావూ, పద్మావతీ కూడా ఒకరి ముఖాలొకరు చూచుకుని నిర్ఘాంతపోయారు.

"అదేమిట్రా ప్రసాద్? ఇప్పటికే నీకు ఇరవైనాల్గు ఏళ్లు దాటుతున్నాయి. గిరిజకి ఇరవై కూడా వస్తున్నాయి. ఇంకా ఎన్నాళ్ళురా మీరిద్దరూ బ్రహ్మచారుల్లా వుండడం?" అంది తల్లి కోపంగా.

"చూడు ప్రసాద్! నువ్వు బి.యస్.సి. చదువుకుంటానంటే సరేనన్నా - బి.యస్.సి. పూర్తయ్యాక యం.యస్.సి. వెళ్ళమంటే; యం.బి.బి.యస్. చదివి డాక్టరు అవుతానన్నావు. అందుకు నేనేమీ అడ్డు చెప్పలేదు. నువ్వు ఏం చదువుకుంటానన్నా నేనేమీ అడ్డుచెప్పను. మా సర్వస్వం నువ్వే! నీ యిష్టమొచ్చినట్లు మా ధనాన్ని ఉపయోగించుకో. కాని ఒక మాటని మాత్రం కాదనకు. గిరిజ నీ భార్య నీ యిష్టప్రకారం ఆమె కూడా గ్రాడ్యుయేటు అయింది. బాగా చదువుకున్న ప్రాజ్ఞురాలు గిరిజ. ఆమెకు నువ్వంటే ప్రాణంతో సమానం. ఆమె మాత్రం నీ ఆశయాలకు అడ్డుపడ్తుందా? నీ యిష్టానికి గిరిజ ఏనాడూ వ్యతిరేకంగా నడుచుకోదని నీకు మాత్రం తెలీదా?" అని కొడుకును ఒప్పించాలని కామేశ్వర్రావు శతవిధాలా ప్రయత్నించాడు. కాని ప్రయోజనం శూన్యమైంది.

"క్షమించండి నాన్నగారూ! నేను ప్రస్తుతం గిరిజను తీసుకువచ్చేందుకు ఒప్పుకోలేను. ఆమెను కావాలంటే ఇంకా చదువుకోమని చెప్పండి" అని ఖండితంగా చెప్పాడు ప్రసాద్.

"సరే! నేను పెద్దవాణ్ణి కాబట్టి చెప్పవలసింది చెప్పాను. అటుపైన మీ అదృష్టం!" అన్నాడు తండ్రి భారంగా.

"కట్టుకున్న యిల్లాలిని కాళ్ళతన్నడం ఇంత చదువుకున్నవాడవు నీకు న్యాయంగా వుందా?" అంది తల్లి.

"పోనీ ఆమె కిష్టమైన ఉద్యోగం చేసుకోమను. బాగా కాలక్షేపం అవుతుంది" అన్నాడు ప్రసాద్.

పట్టినపట్టు వదలని కొడుకు స్వభావం ఎరిగిన తండ్రి ఎవరి కర్మకు ఎవరు కర్తలు? ఊరుకో!" అని భార్యను వారించాడు కామేశ్వరరావు.

కామేశ్వరరావు కొడుకు ఇష్టప్రకారం అప్పటికి బ్యాంకులోవున్న అరవై వేల రూపాయిలూ ప్రసాద్ పరంచేశాడు.

భర్త మాటకు ఎదురాడని పద్మావతమ్మ కోడలిని ఇంటికి తీసుకురావడం మాని, కొడుకు స్వంత డిస్పెన్సరీ తెరవడం ఇష్టం లేకపోయినా, బయటకు గట్టిగా ఏమీ అనలేక కొడుకు కోడలు తమ నట్టింట మసిలేటట్లు చెయ్యమని, వారిద్దరిలోనూ పొత్తు కల్గేటట్లు కొడుకు మనస్సు మార్చమని భగవంతుని ప్రార్థించేది.

ప్రసాద్ క్రొత్తగా డిస్పెన్సరీ ప్రారంభోత్సవం చేసినవాడైనా గిరిజను రమ్మని ఆహ్వానిస్తాడేమోనని ఎదురుచూచింది. కాని ప్రసాద్‌కి అసలు గిరిజను తల్చుకునేందుకు కూడా తీరిక లేనట్లుగా అయిపోయాడు. డిస్పెన్సరీ తెరచిననాడు ఎందరో గొప్ప గొప్ప డాక్టర్లు, ఉన్నతోద్యోగులు, మిత్రులు, బంధువులు అందరూ వచ్చి కామేశ్వరరావు కుటుంబాన్ని గురించి స్తోత్రపాఠాలు వల్లించారు. ప్రసాద్ ఆదర్శాలకీ, ఆశయాలకీ మెచ్చుకుంటూ అభినందించారు. ఉదారగుణసంపన్నుడగు ప్రసాద్ డిస్పెన్సరీ ప్రారంభోత్సవం వార్తాపత్రికల్లో కూడా ప్రకటించారు. ప్రసాద్‌ను గురించి పత్రికలో చదివి గిరిజ మనస్సులో ఎంతో ఉప్పొంగిపోయింది.

తన ప్రసాద్ తనకి ఆహ్వానం పంపుతాడని ఆశించింది గిరిజ. కాని కనీసం ఈ అయిదు సంవత్సరాల్లోనూ ఒక్క జాబుకూడా వ్రాయలేదు.

తను ఎంతో మక్కువతో ఎప్పుడైనా ఉత్తరం వ్రాస్తే జవాబుగా మూడే పంక్తుల కార్డు వచ్చేది.

ప్రియమైన గిరిజకు,

నేను క్షేమంగా వున్నాను. నువ్వు శ్రద్ధగా చదువుతున్నట్లు తలుస్తా. నీ ఆరోగ్యం జాగ్రత్త.

నీ బావ, ప్రసాద్

ఇంతకన్న అతని నుండి ఎప్పుడూ ఎక్కువ జాబు రాలేదు. అయినా అతనియందు తనెప్పుడూ కోపగించలేదు. బాగా చదువుకున్న బావ ఎంతో ఆలోచించే తనకీ చిన్నకార్డు వ్రాశాడనుకునేది. చివరకు తనకు ఆహ్వానం పంపించనందుకు కూడా ఆమె దురభిప్రాయపడలేదు. బావ పని తొందరలో మరిచిపోయాడేమో అనుకొంది. వార్తాపత్రికలో చదివిన గిరిజ ఆనాడు ఎంత సంతోషపడిందో ఆ దైవానికీ, ఆమెకీ మాత్రమే తెలుసు. ఒక్కసారి కళ్ళ కరవు తీరా బావను చూడాలనుకొంది. తనకుతానై వెడితే బావ ఏమనుకొంటాడో? అత్తమామలు ఏమంటారో? తల్లిదండ్రులు అనుమతిస్తారో; లేదో? ఇల్లాంటి సందేహాలతో ఊగులాడిపోతోంది గిరిజ. చివరకు ఓ జాబు కూడా వ్రాసింది ప్రసాద్‌కి. కాని దానికి జవాబుకూడా తనకి రాలేదు.

కామేశ్వరరావుగారు యథాప్రకారం గిరిజకి సొమ్ము పంపిస్తూ, యం. ఎ. లో చేరి చదువుకోమన్నారు. ఈసారి మళ్లీ చదువుకోమనేసరికి గిరిజ మనస్సులో అల్లల్లాడిపోయింది. తన బావ కోరిక కోసం తను బి.ఏ. ఫస్టు క్లాసులో ప్యాసైంది. ఇంకా తనకెందుకు చదువు? ఇన్నాళ్ళూ ప్రసాద్ పట్నంలో చదువుతున్నాడు. కాబట్టి తను దూరంగా వుండడం తప్పలేదు. ఇంకా తనకి ఎందుకీ అగ్నిపరీక్ష? తన బావ హాయిగా ఉన్న ఊరిలో కన్న తల్లితండ్రుల దగ్గరే స్వంత డిస్పెన్సరీ పెట్టుకుని ప్రయివేటు డాక్టరుగా ప్రఖ్యాతి పొందుతూంటే, ఇంకా తనకెందుకీ చదువు? విజ్ఞానానికి సరిపోయే విద్య తనకి చాలదా? తనింక నిగ్రహశక్తితో చదువుకోలేదు. బావ రాగానే చదువుకి స్వస్తిచెప్పి సంసారజీవితంలో ప్రవేశించాలనుకొంది. తన ప్రసాద్ అజ్ఞప్రకారం శారీరకంగానూ, మానసికంగానూ తను ఎంతో ఆరోగ్యవంతురాలిగా వుంది. తమ్ముళ్లతో చెల్లెళ్ళతో చిన్నపిల్లలా కలిసిపోయి ఎంతో సరదాగా వుంటుంది. ఎప్పుడూ ఉరకలు వేసే ఉత్సాహంతో నవ్వుతూ మాట్లాడుతుంది. మగవాళ్ళ విషయంలో మాత్రం అతిగంభీరంగా మసల్తూ, మితభాషియై మాట్లాడుతుంది. తనబావ ప్రసాద్‌నీ తల్చుకుని మురిసి ముగ్ధురాలై ఏ ఆకాశంలోనో గాలిలో తేలిపోతూ విహరిస్తూంటుంది.

(సశేషం)

నలిగిన హృదయాలు

శ్రీమతి పఠానేని శ్రీశైలభ్రమరాంబ

తనకి చదువుకోవడానికి ఇష్టంలేదని వ్రాసినా కూడా మామగారు మళ్ళీ చదువులో చేరమనే ప్రోత్సహిస్తూ వ్రాసిన జాబు చూచి గిరిజ మనస్సు వికలమైపోయింది. ఇంక తనే స్వయంగా వెళ్ళి చెప్పి రావాలనుకొంది. తనతో కూడా తండ్రి సహాయంగా వచ్చి అన్నీ మాట్లాడి శుభకార్యము ఏర్పాటు చేస్తానన్నాడు.

"ప్రసాద్! మా అన్నయ్య గిరిజను తీసుకువస్తున్నట్లు జాబు వ్రాశాడు. ట్రయిన్ వచ్చే టయిముకి మీ నాన్నగారు కోర్టులో వుంటారు. మన కారు తీసుకు నువ్వే వెడతావా స్టేషనుకి?" అంది అన్నం వడ్డిస్తూ పద్మావతి.

గిరిజ కూడా వస్తోంది అన్నమాట వినేసరికి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు ప్రసాద్. కాని అంతలోనే తన ఖంగారు అణుచుకుని "నాకు వీలు కుదరదమ్మా! పోనీ నువ్వే స్టేషన్‌కి వెళ్ళి తీసుకువస్తే బాగుంటుందనుకొంటా!" అన్నాడు.

అత్యంత ఉత్సాహంతో అంగీకరిస్తాడని ఆశించిన తల్లికి కొడుకు మాట వినేసరికి పిడుగుపడట్టు అయింది. మనస్సులో కోపాన్ని ఆపుకోలేక "తండ్రి గడించిన సొమ్ముతో అందరికీ వైద్యం చెయ్యడం, ఇల్లు పట్టకుండా తిరగడమే కాని; పైసంపాదన మాత్రం లేదు. రాకరాక మన యింటికి వాళ్ళంతట వాళ్ళే వస్తున్నా స్టేషన్‌కి వెళ్ళి గౌరవంగా తీసుకొచ్చేందుకు కూడా తీరుబడే నీకు లేదన్నమాట!" అంది ముఖం కందగడ్డలా చేసుకుని.

"మనల్ని నమ్మి మన దగ్గర కొచ్చేవాళ్ళమీద కనికరం చూపించకపోతే మనలో మానవత్వం అనేది ఎక్కడుంటుందమ్మా!" అన్నాడు ప్రసాద్.

"నేననేది అది కాదు. పుట్టెడాశతో వచ్చే గిరిజకు నువ్వు కనిపిస్తే అదెంత సంతోషిస్తుందో తెల్సుకో. నీ కోసం వస్తోంది కాని మా కోసం కాదు కదా!" అని పద్మావతమ్మ ఇంకా ఏదో చెప్పబోతూ ఉండగానే కామేశ్వరరావుగారు అడ్డొచ్చి "పోనిద్దూ! వాడికి తీరిక లేకపోతే నేనే ఆగిపోతా. మనిద్దరం వెళ్ళి తీసుకువద్దాం" అన్నాడు భార్య ధోరణికి అడ్డుకుని.

భర్తని ఎదిరించలేక ఆ యిల్లాలు మూతి ముడుచుకు వెళ్ళింది. తండ్రీ కొడుకు లిద్దరూ భోజనాలు పూర్తయి లేచారు.

ప్రసాద్ స్వంతకారులో కామేశ్వరరావు ఆయన భార్య స్టేషనుకి వెళ్ళి గిరిజని, తండ్రిని వెంటబెట్టుకు వచ్చారు. తను వచ్చేసరికి ప్రసాద్ కనిపిస్తాడని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూసింది. గిరిజ ఇల్లంతా తిరిగింది. మేడ ఎక్కి చూచింది. కాని అతని జాడే లేదు. మధ్యాహ్నం రెండు గంటలకి కాఫీ, ఫలహారాలు రెడీ అయ్యాయి. గిరిజకి మాత్రం తినబుద్ధి కాలేదు. అల్లాగే మేనత్త ముఖంలోకి చూస్తూ కూర్చుండిపోయింది. అది గ్రహించిన పద్మావతి "అబ్బాయి టైమ్‌కి రాడమ్మా! వాడికి ఎప్పుడు తీరుబడి అయితే అప్పుడు వచ్చి, కాఫీ టిఫెన్ తీసుకుంటాడు. నువ్వు పుచ్చుకో" అని బలవంతపర్చడంతో విధిలేక కాఫీ మాత్రం త్రాగింది గిరిజ.

కొండలరావు బావమరదితోనూ, చెల్లెలితోనూ కబుర్లు చెబుతూ కూర్చున్నాడు. గిరిజ కూడా అక్కడున్నదన్నమాటేగాని ఆమె దృష్టంతా ప్రసాద్ వైపుకే పోతోంది. అల్లా ఎంతసేపు గడిచిందో వారు కబుర్ల ధోరణిలో గుర్తించకపోయినా వంటమనిషి పిలుపుతో టైమ్ చూచుకున్నారు. అప్పటికే రాత్రి ఎనిమిది గంటలైంది. "లేవండి అన్నయ్యా! ప్రొద్దుపోతోంది. ఇంటి దగ్గర ఎప్పుడు తిన్నారో యేమో!" అని పద్మావతమ్మ హెచ్చరించింది.

"ప్రసాద్ కూడా రానియ్యండి" అన్నాడు కొండలరావు.

"ఆ! వాడికోసం కూర్చుంటే అయినట్టే ఒక్కొక్కప్పుడు పగలు రెండు మూడు అవుతుంది. రాత్రిళ్ళు పది పదకొండు కూడా అవుతుంది. ఇవ్వాళ మాత్రం వాడు నాతోబాటు పదింటికే తిన్నాడు" అంటూ కుర్చీలోంచి లేచాడు కామేశ్వరరావుగారు.

"గిరిజా! నువ్వుకూడా రా అమ్మా!" అంది సాదరంగా.

"నాకిప్పుడే ఆకలిలేదు అత్తయ్యా! పది అయినాగాని వుంటాను" అంది గిరిజ.

కోడలు మనస్సును గ్రహించిన పద్మావతమ్మ ఇంకేమీ అనలేకపోయింది. భర్త, అన్నగారు వంటింట్లోకి వెడుతూంటే తనూ వారితో కూడా వెళ్ళింది.

వంటింట్లో వారు భోజనాలు చేస్తుంటే గిరిజ తిన్నగా మేడమీదికి వెళ్ళి ప్రసాద్ పడుకునే గది తలుపు తెరిచింది. గదిలోవున్న ప్రసాద్ ఫోటోని రెప్పవాల్చకుండా చూస్తోంది. విశాలమైన ఫాలం, ఉత్సాహాన్ని వెదజల్లే ఆ ముఖం, వెలుగును వెదజల్లే కాంతివంతమైన ఆ పెద్దపెద్ద కళ్లూ, బుద్ధికుశలతను తెలియచేసే ఆ సూదిమొనగల ముక్కూ, చంద్రవంక వలెనున్న ఫాలానికి ఆ నిండైన క్రాపు, చిరునవ్వులు చిందించే ఆ పెదిమలు, కండలు తిరిగిన దండలు, వెడల్పైన ఛాతీ, పొడవైన భారీ విగ్రహం, ఆ ప్రసాద్ ఫోటోని తనివితీరా చూచి తృప్తిగా నవ్వుకొంది గిరిజ. తన బావ ఎంతో బలిష్ఠుడు. సుందర స్వరూపుడు. అతని సుందరరూపమే ఎప్పుడూ తన హృదయంలో హత్తుకుపోయి, అతని నామాక్షరాలే హృదయంలో జపిస్తూ, అతన్నే దైవంగా భావించుకుంటూ చదువంతా పూర్తిచేసింది. తన బావ ఇప్పటికి చదువంతా పూర్తిచేసి బాధ్యతాయుతమైన డాక్టరుగా పనిచేస్తున్నాడు. తన బావని చూచి పంచవర్షాలైంది. ఇంక బావని క్షణమైనా వదలకుండా వుండచ్చు. ఇప్పుడే బావ వచ్చి తన దగ్గరగా వచ్చి తనని గిరిజా! అని పిలిస్తే... ఒక్కసారిగా అల్లా తలుచుకునేసరికి ఒళ్ళు పులకరించింది.

తను వస్తూన్నట్లు తెలిసీకూడా బావ ఎందుకు రాలేదు? పోనీ మధ్యాహ్నం పన్నెండు గంటలకే తాము వస్తామని ముందే వార్త తెలుసుకుని కూడా ఇప్పటివరకూ ఒక్కసారైనా దర్శనమివ్వడానికే బావకి తీరికలేకపోయిందా? ఏమిటో! డాక్టర్లకి అసలు తీరికే చిక్కదేమో! బావ ఇంటర్ చదివే రోజుల్లో తనూ బావా ఎంత సరదాగా వుండేవారు! శలవులకి తమ యింటికి వస్తే తన షికార్లకీ, సినీమాలకీ తీసుకువెళ్ళేవాడు. తననీ బావనీ చూచి అత్తయ్య మామయ్య ఎంతో మురిసిపోయేవారు.

గిరిజ ఆ గదిలో కూర్చుని అంతులేని ఆలోచనలతో సతమతమౌతోంది. అంతలో అత్తయ్య వచ్చి "గిరిజా!" అని పిలవడంతో తన ఆలోచన తోరణం తెగింది. మామయ్య, నాన్న కూడా "బ్రేవ్" మని త్రేనుస్తూ మేడమీదికే వచ్చారు. మామయ్య "గిరిజా! నువ్వుకూడా భోజనం చెయ్యమ్మా! అబ్బాయి కోసం కూర్చుంటే చాలా ప్రొద్దుపోతోంది" అంటూ చెబుతూ గదిలోకి వచ్చారు.

"నువ్వు తినెయ్యి అత్తయ్యా! నేను పది అయినాకాని వుంటాను" అంది వ్యంగ్యంగా.

"గిరిజా! ఈ పూటకి తినెయ్యమ్మా! రేపు అబ్బాయి వచ్చేవరకూ వుండొచ్చు" అంటూ పద్మావతమ్మగారు గట్టిగా బలవంతపర్చడంతో గిరిజ యింక కాదనలేకపోయింది. మనస్సులో ఏదో తప్పు చేస్తున్నట్లు బాధపడ్తూనే భోజనం ముగించి లేచింది.

రాత్రి అందరూ నిద్రపోతూన్నా బావ రాక కోసం ఎదురుచూస్తూ గిరిజ మాత్రం హాల్లో సోఫాలో కూర్చొంది. రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో కారు వచ్చి పోర్టికోలో ఆగింది. బాగా అలిసిపోయి నిద్రమత్తుతో తూలిపోతూ ప్రసాద్ హాల్లోకి వచ్చాడు. ఒక్కక్షణం ఒకరు ముఖంలోకి ఒకరు ఆశగా చూచుకున్నారు. "బావా!" అని అప్రయత్నంగా తన నోట్నుంట వచ్చేసింది —

"యీ వేళ నాలుగు డెలివరీ కేసులొచ్చాయి. అందుచేత ఇంతవరకూ నాకు క్షణంకూడా ఖాళీ చిక్కలేదు. నువ్వూ మామయ్య వచ్చినట్లు అమ్మ కబురుచేసినా హాస్పత్రి వదలడానికి అవకాశం లేకపోయింది. మరోలా అనుకోకు గిరిజా!" అంటూ సోఫాలో కూర్చున్నాడు ప్రసాద్. అతనికి ఎదురుగా నిలుచునేవుంది గిరిజ.

"బావా! నీకోసం..." అంటూ ఏదో చెప్పబోయింది గిరిజ.

"ఇల్లా కూర్చో గిరిజా!" అన్నాడు చిరునవ్వుతో ప్రసాద్.

గిరిజ ప్రసాద్‌కు ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

"గిరిజా! నువ్వు బి.ఏ. ఫస్టు క్లాసులో ప్యాసైనందుకు ఎంతో సంతోషించా. యం.ఎ. కూడా అల్లాగే ప్యాసవ్వాలి అని ఆశిస్తున్నా" అన్నాడు ప్రసాద్.

"ఇంక నాకు చదువుకోవాలని లేదు బావా!" అంది గిరిజ.

"అదేమిటి గిరిజా! అవకాశమున్నప్పుడు చదువుకోకపోతే తర్వాత చదువుకోవాలన్నా సాధ్యమౌతుందా?"

(సశేషము)